




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 14, 2026 | సంపుటి : 2 | సంచిక : 303 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

### కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు

- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్13 :**
ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మిగతాద్ది 2 లో




## పదేళ్ల బిఆర్ఎస్..

# రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

- » గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- » రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- » వారు చేసిన చేతబడి తిరగబడింది
- » నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- » ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్

**హైదరాబాద్,ఆగస్ట్13 :**
పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి.

మిగతాద్ది 2 లో



## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్టు13 :**
దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

2 లో



## ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

- అప్రమత్తంగా ఉండాలన్న సిఇవో

**హైదరాబాద్,ఆగస్ట్13 :**
ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన

# కళ్యాణలక్ష్మి

- » పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు
- » ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్,ఆగస్ట్13 :**
రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టుస్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు.

2లో..



## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

- జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించాలి
- ఎంపిలంతా ప్రధాని మోడీని కలసి వివరించాలి మాజీ ఎంపి వినోద్ కుమార్ డిమాండ్

2 లో



## పంద్రాగస్టు ఏర్పాట్లు

# పకడ్బందీగా ఉండాలి

- » ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి
- » విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి
- » అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- » అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్

**హైదరాబాద్,ఆగస్టు13**

మిగతాది 2లో



## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే

# బోనాలు ఎత్తిస్తాం

- ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.
- గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్13 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.

మిగతాది 2లో

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

- కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

**న్యూఢిల్లీ,ఆగస్టు13**
కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు.



2లో..




## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

- అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పి.డి.వో.లు నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్13 :**
ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.

మిగతాది 2లో

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించినఘనత కాంగ్రెస్‌దే

మొదటిపేజీ తరువాయి

హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్–1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్–1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్–1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్–1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్–1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

మొదటిపేజీ తరువాయి

పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు.

ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

**రాజన్న సిరిసిల్ల,ఆగస్ట్13 :**

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి అంశాన్ని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కులపై భంగం కలుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తదితరులతో కలసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి , తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కూడా ఈ అంశంపై తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై విమర్శలు జీఆర్ఎంబీ బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేస్తే రాష్ట్రంలో తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వినోద్‌కుమార్ హెచ్చరించారు.

# ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

మొదటిపేజీ తరువాయి

గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండలస్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

మొదటిపేజీ తరువాయి

దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, ఖఎఔలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

మొదటిపేజీ తరువాయి

గత ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని రంగుల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తులం బంగారం ఇవ్వకపోగా పథకాన్ని కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన పథకాలను పూర్తిగా రూపుమాపే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నాటకాలకు తెరలేపుతోందని దుయ్యబట్టారు. 2014 నుంచి బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,

మైనారిటీ, ఈబీసీ వర్గాలకు రూ. 13 వేల కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచామని పేర్కొన్నారు. ?ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తును వీడి, వచ్చే విచారణ గడువైన సెప్టెంబరు 9 లోగా ఉన్నత న్యాయస్థానంలో బలమైన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్దిదారులకు వెంటనే నిధులు విడుదలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, చట్టసభల్లోనూ పోరాడుతుందని హెచ్చరించారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి

రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి

ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కూటమి అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లిలో గురువారం పర్యటించారు. నక్కపల్లిలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనితకు అడుగడుగున హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోం మంత్రి ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 14, 2026

# అవయవ దానం మహోన్నత మానవతా సేవ -- ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- అవయవ దానంపై అపోహలు తొలగించి శాస్త్రీయ అవగాహన పెంచాలి
- అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు









**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 13**
మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అత్యున్నత మానవతా సేవే అవయవ దానమని, ప్రతి పౌరుడు ఈ సామాజిక బాధ్యతను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ 'అవయవ దాన దినోత్సవం" సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ. ప్రదీప్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కళ్ల వంటి అవయవాలను దానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. మానవత్వానికి నిదర్శనమైన అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. ప్రదీప్ మాట్లాడుతూ.. ప్రజలకు చట్టపరమైన హక్కులతో పాటు అవయవ దానానికి సంబంధించిన విధివిధానాలు, కుటుంబ సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవా సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా వేదికలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే సమాజంలో సానుకూల మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. ఉపేందర్ రావు మాట్లాడుతూ.. ఒకరి జీవితానికి ముగింపు వచ్చినా, మరొకరి జీవితానికి కొత్త ఆరంభాన్ని అందించే మహోన్నత దానం అవయవ దానమని పేర్కొన్నారు.
కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ మాట్లాడుతూ.. "అవయవ దానం -- మరణం తర్వాత కూడా జీవించే మానవత్వం"లిలి అనే భావనను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలని సూచించారు. రీజనల్ ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. అవయవ దానంపై సమాజంలో ఇంకా అపోహలు, భయాలు కొనసాగుతున్నాయని, శాస్త్రీయ అవగాహన పెరిగితే మరెందరో రోగులకు నూతన జీవితం లభిస్తుందని చెప్పారు. సమావేశంలో అవయవ దానంపై రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించి న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఎంజీఎం ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ సనత్ రోషన్ మాట్లాడుతూ.. ఒక మంచి నిర్ణయం అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా మారుతుందని, అవయవ దానంపై అపోహలను తొలగించేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను కోరారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, అవయవ దాన అసోసియేషన్ అధ్యక్షుడు కోన్. మల్లారెడ్డి మాట్లాడుతూ.. అవయవ దానం కేవలం వైద్యపరమైన అంశం మాత్రమే కాకుండా మానవత్వం, దాతృత్వం, సామాజిక బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులతో "అవయవ దానం చేద్దాం -- ప్రాణాలను కాపాడుదాం -- మానవత్వాన్ని చాటుదాం"అనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, వైద్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు.

## భారత రహదారి పరిశోధనలో ఎన్ఐటీ వరంగల్‌కు సాంకేతిక ముందడుగు

- సప్తగాన్ ఏషియాతో అవగాహన ఒప్పందం.. రూ.30 కోట్ల అత్యాధునిక లేజర్ సాంకేతికత ప్రదర్శన






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 13**
భారతదేశంలో రహదారి మౌలిక సదుపాయాల పరిశోధన, రవాణా సాంకేతికత అభివృద్ధికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ మరో కీలక ముందడుగు వేసింది. రహదారుల పరిస్థితి అంచనా, సంయుక్త పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాల కోసం ఎన్ఐటీ వరంగల్, సప్తగాన్ ఏషియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ భాగస్వామ్యంతో రవాణా ఇంజినీరింగ్, రహదారి నిర్మాణ ఇంజినీరింగ్, జాతీయ రహదారులు, రహదారి ఆస్తుల నిర్వహణ, తెలివైన రవాణా వ్యవస్థలు, స్మార్ట్ రవాణా, డిజిటల్ ఇంజినీరింగ్, కృత్రిమ మేధస్సు ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి రంగాల్లో సంయుక్త పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమ-విద్యాసంస్థల సహకార కార్యక్రమాలు చేపట్టనున్నారు.
ఒప్పందంలో భాగంగా సప్తగాన్ ఏషియా సంస్థ సుమారు రూ.30 కోట్ల విలువైన అత్యాధునిక లేజర్ ఆధారిత రహదారి పేవ్‌మెంట్ మూల్యాంకన వాహనాన్ని ఎన్ఐటీ వరంగల్‌లో ప్రదర్శించింది. ఈ సాంకేతికత ద్వారా రహదారుల బలహీన ప్రాంతాలను వేగంగా, అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, డేటా ఆధారంగా నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సాధ్యమవుతుంది.
ఈ ప్రదర్శనను ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు, బీటెక్, ఎంటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించి, ఆధునిక రహదారి అంచనా విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఈ లేజర్ సాంకేతికత వేగవంతమైన, శాస్త్రీయమైన, డేటా ఆధారిత ఫలితాలను అందిస్తుందని నిపుణులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఆధునిక రవాణా సాంకేతికతను ఎన్ఐటీకి తీసుకురావడంలో ప్రొఫెసర్ ఎస్. శంకర్ చేసిన కృషిని అభినందించారు. వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాల సాధనలో ఇటువంటి భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.
ఎంఓయూ ద్వారా సంయుక్త పరిశోధనలు, సాంకేతిక సలహా సేవలు, శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, కార్యశాలలు, విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు, ప్రత్యక్ష ప్రాజెక్టులు, అధ్యాపకుల పరస్పర సహకారం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల అభివృద్ధి, ప్రయోగశాలల వినియోగం, సాంకేతిక ప్రచురణలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎంఓయూ అమలుకు సంబంధించి ఎన్ఐటీ వరంగల్ తరఫున ప్రొఫెసర్ ఎస్. శంకర్ సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. ఇరు సంస్థలు సంయుక్త సమన్వయ కమిటీ ద్వారా పరిశోధన, శిక్షణ, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లనున్నాయి. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న రహదారి మౌలిక సదుపాయాల నేపథ్యంలో ఈ లేజర్ ఆధారిత సాంకేతికత ద్వారా రహదారుల పరిస్థితిని ముందుగానే అంచనా వేసి, సమయానికి మరమ్మతులు చేపట్టడం, ప్రజా నిధుల సమర్థ వినియోగం, ప్రయాణ భద్రత, రహదారుల నాణ్యతను మరింత మెరుగుపరచడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 13**
మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి ఆమె గర్భవతి కావడానికి కారణమైన కేసులో నిందితుడిని మట్వాడ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.
పోలీసుల వివరాల ప్రకారం, బాధితురాలి తల్లి ప్రైవేట్ సంస్థలో స్వీపర్‌గా పనిచేస్తుండగా, బాలికను కొన్నేళ్ల క్రితం వసతి గృహంలో చేర్పించారు. గత ఏడాది జూన్‌లో నిందితుడు సంగాల విజయ్‌కుమార్ (38) బాలికను మాయమాటలతో తన గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం పలుమార్లు వసతి గృహం నుంచి బాలికను బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
ఇటీవల బాలిక అనారోగ్యానికి గురై కడుపునొప్పితో బాధపడుతుండటంతో తల్లి ఆరా తీయగా ఘటన వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షల్లో బాలిక గర్భవతిగా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.
ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలి వాంగ్మూలాన్ని భరోసా కేంద్రం ద్వారా నమోదు చేసి, వైద్య పరీక్షలు నిర్వహించారు. వాహన తనిఖీల సమయంలో తప్పించుకునేందుకు ప్రయత్నించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని, వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ డివిజన్ ఏసీపీ తెలిపారు.

## డ్రైనేజీ లైన్ మూసుకుపోవడంతో బాబానగర్‌లో దయనీయ పరిస్థితి

- రోడ్లు, ఇళ్లలోకి మురుగు నీరు.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్ ప్రతినిధి గౌరవ్ బీడ్కర్, ఆగస్టు 13**
హైదరాబాద్‌లోని ఉప్పల్ పరిధిలోని నాచారం బాబానగర్ ప్రాంతంలో డ్రైనేజీ లైన్ మూసుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పలుచోట్ల మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.



మురుగు నీరు ఇళ్లలోకి చేరడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలు కూడా కష్టసాధ్యంగా మారాయి. ఈ పరిస్థితుల కారణంగా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి అధికారులకు ఫిర్యాదు చేసి 3114 ఫిర్యాదు టోకెన్ సంఖ్య నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ఇళ్లలోకి మురుగు నీరు ప్రవహిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ లైన్‌ను శుభ్రపరిచి, మురుగు నీటి ప్రవాహాన్ని అరికట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కొండా కరుణాకర్ విజయం

- 17 ఓట్ల మెజార్టీతో గెలుపు.. నూతన కార్యవర్గాన్ని అభినందించిన సీపీ ఎన్. శ్వేత





**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 13**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ప్రశాంతంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు నోడల్ అధికారిగా, అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్యల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాలకు చెందిన మొత్తం 110 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్ తన ప్రత్యర్థి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి. బాబుపై 17 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా బి. సతీష్ (ఆర్ఐ), బి. శరత్‌కుమార్ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు (దామెర ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ (కాజీపేట), కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్‌కుమార్ (ఏఆర్), కోశాధికారిగా బి. నరేష్ (పాలకుర్తి) ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. తులసి, సీహెచ్. మహేందర్ యాదవ్, ఏ. రమేష్, ఎన్. ప్రవీణ్, ఎండీ. తాజుద్దీన్, పి. సర్వేశ్ ఎన్నికయ్యారు.
ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అభినందిస్తూ, సంఘం పోలీస్ అధికారుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## కొత్త ఆసరా పింఛన్లకు ఆగస్టు 31 వరకు దరఖాస్తులు

**కరపత్రం ప్రతినిధి వరంగల్/హైదరాబాద్, ఆగస్టు 13**
రాష్ట్ర ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛను పథకం కింద కొత్త ఆసరా పింఛన్ల కోసం ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. అర్హత నిబంధనల్లో ఎలాంటి మార్పులు లేవని, గతంలో అమల్లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే అర్హతలను పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. తొలి దశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదక వ్యాధిగ్రస్తులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫిలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న అర్హులకు పింఛన్లు మంజూరు చేయనున్నారు. ప్రజాపాలన, 99 రోజుల ప్రగతి గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారినీ పరిశీలనలోకి తీసుకోనున్నారు. గతంలో అన్ని ధ్రువపత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అయితే పత్రాలు సమర్పించని వారు, ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతలను నిర్ధారించి, జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత పింఛన్లు మంజూరు చేయనున్నారు. అర్హులకు దరఖాస్తులు, అవసరమైన ధ్రువపత్రాల సేకరణలో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు సహకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి

- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 13**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో సేకరించని,'సేకరించలేనివి'గా గుర్తించిన గణన ఫారమ్‌ల పూర్తి వివరాలను అందించాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు,బూత్ స్థాయి ఏజెంట్-1మహమ్మద్ అయూబ్ కోరారు.ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్యశారదకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ..గణన ఫారమ్ సమర్పించలేదనే కారణంతో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకూడదని అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా సేకరించని గణన ఫారమ్‌ల జాబితా,వాటిని 'సేకరించలేనివి'గా గుర్తించిన కారణాలు,నిబంధనల మేరకు అందుబాటులో ఉన్న ఓటర్ల సంప్రదింపు వివరాలను అందించాలని కోరారు.ఈ వివరాల ఆధారంగా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు,బూత్ స్థాయి ఏజెంట్లు,సమన్వయ బృందాలు క్షేత్రస్థాయిలో సంబంధిత ఓటర్లను గుర్తించి,వారికి అవగాహన కల్పిస్తాయని తెలిపారు.అవసరమైన క్లెయిమ్‌లు,అభ్యంతరాలు దాఖలు చేసి ఓటు హక్కును పరిరక్షించుకునేలా సహకరిస్తామని చెప్పారు.అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటర్ల జాబితాలో ఉండేలా,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన,సమగ్ర,ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు.

## హనుమకొండలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

- వికసిత్ భారత్ సాధనకు సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్సీ మల్క కొమరయ్య




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 13**
హనుమకొండలో 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా గురువారం సాయంత్రం వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని త్రివర్ణ పతాకాలను చేతబట్టి వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో నగరాన్ని మార్మోగించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. తిరంగా దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా ముందుకు సాగుతోందని, శక్తివంతమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.
కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావు పద్మారెడ్డి, డా. పగడాల కాళీప్రసాద్ రావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా. పెసరు విజయ్ చందర్ రెడ్డి, పులి సర్వోత్తం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు, డివిజన్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# గనుల రంగంలో సంస్కరణలకు బీఆర్ఎస్ మద్దతు..

## రాష్ట్రాల హక్కులు పరిరక్షించాలి: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

- గనులు, ఖనిజాల (అభివృద్ధి-నియంత్రణ) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో చర్చ
- తాడిచర్లతో పాటు కోయగూడెం, మణుగూరు, శ్రావణపల్లి గనులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రానికి విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 13**
దేశ ఆర్థికాభివృద్ధికి ఖనిజ సంపద వెన్నెముక వంటిదని, పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల విస్తరణ, స్వచ్ఛ ఇంధన సాంకేతికతలు, జాతీయ భద్రత అవసరాల దృష్ట్యా గనుల రంగంలో సమర్థవంతమైన విధానాలు అత్యవసరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అయితే గనుల రంగంలో సంస్కరణలు చేపట్టే క్రమంలో సమాఖ్య స్ఫూర్తిని కాపాడుతూ.. ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల ఆర్థిక హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రాజ్యసభలో గురువారం గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు--2026పై జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర, ఈ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు. దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, వ్యూహాత్మక ఖనిజాల అవసరం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కలిగించే పారదర్శక, స్థిరమైన గనుల విధానం అవసరమని అన్నారు.

ఈ సవరణ బిల్లు ద్వారా గనుల రంగంలో పన్నులు, సెస్‌లు, ఇతర రుసుముల విధానంలో స్పష్టత, ఏకరూపత తీసుకురావడం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఖనిజ హక్కులు, గనుల భూములపై రాష్ట్రాలు విధించే పన్నులు, రుసుముల విషయంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిబంధనలు, పరిమితులు నిర్దేశించే అధికారం పొందుతుందని, దీంతో బహుళ పన్నుల భారం తగ్గి పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రాలు వసూలు చేసిన మొత్తాలకు చట్టబద్ధత కల్పించడం ద్వారా వాటిని తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదని బిల్లు స్పష్టం



చేస్తోందన్నారు.

స్వతంత్ర విధాన విశ్లేషణల ప్రకారం ఈ బిల్లు గనుల రంగంలో విధానపరమైన స్థిరత్వం, నియంత్రణలో స్పష్టత, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్న ఆయన, అదే సమయంలో ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల ఆర్థిక హక్కులు, సమాఖ్య వ్యవస్థ, జాతీయ ప్రయోజనాల మధ్య సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పెట్టుబడులను ఆకర్షించే సంస్కరణలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని, అయితే గనుల తవ్వకాల వల్ల పర్యావరణ పరిరక్షణ, పునరావాసం, సామాజిక బాధ్యత వంటి భారాన్ని రాష్ట్రాలే భరిస్తున్నందున వాటి ఆదాయ హక్కులు, అభివృద్ధి అవసరాలు తప్పనిసరిగా పరిరక్షించబడాలని రవిచంద్ర స్పష్టం చేశారు.

తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖనిజ వనరుల నిర్వహణలో పారదర్శక విధానాన్ని అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కే.టి. రామారావు నాయకత్వంలో గనుల అనుమతుల ప్రక్రియను సరళీకృతం చేయడం, పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, ఖనిజ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం వంటి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సహజ వనరులను ప్రాంతీయాభివృద్ధి, ఉపాధి కల్పనకు వినియోగించే దిశగా గత ప్రభుత్వం విశేష కృషి చేసిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో గనుల రంగానికి సంబంధించి పలు సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు.

దేశానికి ఇప్పుడు శాస్త్రీయ ఖనిజ అన్వేషణ, పర్యావరణహిత తవ్వకాలు, డిజిటల్ పర్యవేక్షణ, దేశీయ విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, పారదర్శక పరిపాలన అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఖనిజాలను కేవలం తవ్వి ఎగుమతి చేయడం కాకుండా, వాటి ఆధారంగా దేశంలోనే స్వయం సమృద్ధిగల తయారీ వ్యవస్థను నిర్మించడం లక్ష్యంగా ఉండాలని సూచించారు.

ఇటీవల తాడిచర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయించినందుకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సభలోనే కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ రవిచంద్ర, కోయగూడెం, మణుగూరు, శ్రావణపల్లి గనులను కూడా సింగరేణి కాలరీస్ కంపెనీకి కేటాయించాలని కోరారు. దీనివల్ల తెలంగాణలో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల హక్కుల మధ్య సమతుల్యతను కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగాలని కోరుతూ, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు--2026కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వెల్లడించారు.

## ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ ఇన్‌చార్జిగా గడ్డం విశాల్

**కరపత్రం ప్రతినిధి హుజూరాబాద్, ఆగస్టు 13**
ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ డివిజన్ ఇన్‌చార్జిగా గడ్డం విశాల్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక హుజూరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.



ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదుగుల ఓదెలు ఆధ్వర్యంలో, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంతడుపుల బాబు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టారు. డివిజన్ పరిధిలో యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపు నిచ్చారు. తన నియామకానికి సహకరించిన హుజూరాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ అధ్యక్షులు సంధ్యల వెంకన్న, అంబేద్కర్ – పూలేవాది డివిజన్ కన్వీనర్ రామగిరి అంకుష్, మండల కన్వీనర్ రామ్ సారయ్య మరియు డివిజన్ కన్వీనర్ అంబాల కుమారస్వామిలకు గడ్డం విశాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లోని అంబేద్కర్ వాదులు, యువతను ఏకం చేస్తూ సంఘ అభివృద్ధికై నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు.

## కాజీపేట సోముడిలో ఎమ్మెల్యే నాయిని పరామర్శ

- ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నేత లింగారెడ్డికి ధైర్యం..
- మాతృవియోగం పొందిన యాదగిరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

**కరపత్రం ప్రతినిధి ఖాజీపేట, ఆగస్టు 13**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం కాజీపేట 62వ డివిజన్ పరిధిలోని సోముడిలో పర్యటించి, ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగారెడ్డిని, మాతృవియోగం పొందిన గౌడ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి యాదగిరి కుటుంబాన్ని పరామర్శించారు.



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన లింగారెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల కన్నుమూసిన గొల్లపల్లి యాదగిరి తల్లి కౌసల్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరుని దర్శించుకున్న ఓబీసీ మోర్చా నేత మందోటి మహేందర్ పటేల్ దంపతులు

- కాశీ దర్శనం అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతి
- ఓబిసి మూర్చ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 13**
దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన పవిత్ర కాశీ విశ్వేశ్వర (కాశీ విశ్వనాథ్) దేవాలయాన్ని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్ తన సతీమణితో కలిసి గురువారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సుఖశాంతులు,



దేశాభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, సమాజంలో ఐక్యత నెలకొనాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మందోటి మహేందర్ పటేల్ మాట్లాడుతూ.. "కాశీ విశ్వేశ్వరుని దర్శించుకోవడం జీవితంలో ఒక అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతి. పరమేశ్వరుని అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ప్రార్థించాను. దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆధ్యాత్మిక చైతన్యం నిండాలని భగవంతుడిని వేడుకున్నాను. భక్తితో చేసే ప్రార్థనలకు భగవంతుడు తప్పకుండా ఫలితాన్ని ప్రసాదిస్తాడనే విశ్వాసం నాకు ఉంది" అని అన్నారు. దర్శనం అనంతరం ఆలయ పరిసరాలను సందర్శించి, కాశీ క్షేత్రం యొక్క ఆధ్యాత్మిక వైభవం, సనాతన ధర్మ పరిరక్షణలో ఈ దేవాలయం పోషిస్తున్న పాత్ర విశిష్టమైనదని మహేందర్ పటేల్

# వరంగల్‌కు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- 12 వేల మంది కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు స్థానికంగా వైద్య సేవలు అందించాలన్న విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 13**
ఆగస్టు 13 వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను తక్షణమే మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించి, వరంగల్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్ఎస్ వైద్య సేవలపై



ఆధారపడుతున్నారని తెలిపారు. అయితే వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో చికిత్స, వైద్య పరీక్షలు, మందుల కోసం 350 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, తరచూ వైద్య సేవలు అవసరమయ్యే పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల దశలో పెండింగ్‌లో ఉందని ఎంపీ తెలిపారు. భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తికాగా, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని ఆమె కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

అన్ని పరిపాలనా ప్రక్రియలు దాదాపు పూర్తయిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

వరంగల్ లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి వస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు పొందే అవకాశం కలుగుతుందని, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని ఎంపీ పేర్కొన్నారు.

# తిరంగా ర్యాలీలో ఎంపీ ఈటల రాజేందర్..

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని పిలుపు

- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 13**
దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఐడీపీఎల్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన **ఘనమైన "తిరంగా ర్యాలీ"** లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

జాతీయ జెండాను చేతబూని కార్యకర్తలతో కలిసి ర్యాలీలో నడిచిన ఈటల రాజేందర్, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి భారతీయుడు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం అనేక జాతులు, భాషలు, సంస్కృతులకు నిలయమైనప్పటికీ అందరినీ ఏకం చేసే శక్తి జాతీయత అని పేర్కొన్నారు. మనమంతా భారతమాత ముద్దుబిడ్డలమని, జనగణమన,



వందేమాతరం వంటి జాతీయ గీతాలు అసేతు హిమాచలం భారతీయులను ఐక్యంగా నిలబెడుతున్నాయని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠ, గౌరవం మరింతగా పెరిగిందని ఆయన అన్నారు. దేశ అభివృద్ధి, ప్రగతి కోసం ప్రతి భారతీయుడు మోదీ నాయకత్వానికి చేయూతనిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, వడేపల్లి



రాజేశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శేషగిరి రావు, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి కాంతరావు, కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల జయశేఖర్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, సీనియర్ నాయకులు వేముల రమేష్, బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, సాయి కిరణ్ రెడ్డి, ఆర్తిక్ యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు,

# 16వ డివిజన్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' యాత్ర

- ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేసి దేశభక్తిని చాటాలని పిలుపు
- హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన తిరంగా ర్యాలీలోనూ పాల్గొన్న బిజెపి నాయకులు

**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 13**
భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా వరంగల్ నగరంలోని 16వ డివిజన్‌లో గురువారం ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. 16వ డివిజన్ అధ్యక్షురాలు జాలిగాపు ప్రసన్న - రాంప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మండలి సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్‌లో ఇంటింటికీ తిరుగుతూ జాతీయ పతాక ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించిన నాయకులు, ప్రతి కుటుంబం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా గట్టికొప్పుల రాంబాబు మాట్లాడుతూ,



స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికార పరిరక్షణ ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని, జాతీయ జెండాపై గౌరవాన్ని ప్రతి ఇంటిలో పెంపొందించాలని సూచించారు. 16వ డివిజన్‌లో యాత్ర విజయవంతంగా కొనసాగిస్తూ.. ర్యాలీగా వెళ్లి బీజేపీ ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన భారీ 'తిరంగా ర్యాలీ'లో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. జాతీయ



జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో దేశప్రేమ, జాతీయ ఐక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సుంకరి రాజు, బీజేపీ వెనుకబడిన వర్గాల మోర్చా కార్యవర్గ సభ్యుడు బైకని వెంకటేష్, ఐటీ విభాగం కన్వీనర్ బొమ్మగాని దిలీప్ కుమార్, బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి ల్యాద రాజేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సభవత్ నాగరాజు, బీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, బూత్ అధ్యక్షులు బొంత అశోక్, మంద కుమారస్వామి, బోసు రాజేష్, డివిజన్ నాయకుడు చారితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.